నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# కరీంనగర్

సోమవారం 2 అక్టోబర్ 2023 | MONDAY, OCTOBER 2, 2023 | KARIMNAGAR | పేజీలు PAGES : 16


## మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలి

ఉమ్మడి పాలనలో వేసిన వరిపంట చేతికివచ్చేదాకా ఎదురుచూసే పరిస్థితి ఉండేది. కానీ, సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. దీని నుంచి కాకతీయ కెనాల్‌కు లింక్ ఏర్పాటు చేసిన తర్వాత పెద్దపల్లి, మంథని, ధర్మపురి ఏరియాల్లో ఎక్కడా చూసినా నీళ్లే కనిపిస్తున్నాయి. నడి ఎండల్లోనూ చెరువులు, కుంటలు నిండుగా కనిపిస్తున్నాయి. రెండు పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. బీఆర్ఎస్ పాలనలో రైతాంగం సంతోషంగా ఉన్నది. సంక్షేమ పథకాల అమలుతో నిరుపేదలు నిశ్చింతగా బతుకుతున్నారు. సబ్బండ వర్గాల కోసం మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలి. పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలుగా మంచి పేరున్న దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

**- పెద్దపల్లి, గోదావరిఖని సభల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్**





పెద్దపల్లిలో దాసరి మనోహర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేస్తున్న మంత్రి కేటీఆర్

పెద్దపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు





## కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేద్దాం

కాలనాగు లాంటి కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం జేసింది? పంట పెట్టుబడికి రైతుబంధు ఇచ్చిందా..? వ్యవసాయానికి 24 గంటల ఫ్రీ కరెంట్ ఇచ్చిందా..? మడులు తడిచేలా నీరందించిందా..? మరణించిన రైతు కుటుంబాలకు రైతుబీమా ఇచ్చిందా..? ప్రజలు ఆలోచించాలి. కానీ, అభివృద్ధి చేసేది, అన్ని వర్గాలకు మేలు చేసేది బీఆర్ఎస్ సర్కారే. తెలంగాణ రాకముందు 85 వేల ఎకరాల్లో వరి పంట వేసేది. 2 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చేది. స్వరాష్ట్రంలో 2.12 లక్షల ఎకరాల్లో 4 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తున్నది. ఈ రోజు మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ₹150 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం ఆనందంగా ఉన్నది. ఈ అభివృద్ధి మున్ముందు కొనసాగాలంటే మీ బిడ్డగా మీ ముందుకు వస్తున్న మరోసారి ఆశీర్వదించండి. కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచండి. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేయండి.

**-పెద్దపల్లి ప్రగతి నివేదన సభలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి**



ఖనిలో కోరుకంటి చందర్‌ను గెలిపించాలని కోరుతున్న మంత్రి

## మరోసారి ఆశీర్వదించండి

కేటీఆర్ ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ. యువతరానికి నడకలు నేర్పి ఉపాధి, ఉద్యోగాల కల్పనకు ఐటీ, ఇండస్ట్రియల్ పార్కులను మంజూరీ చేసిన మంత్రి కేటీఆర్ రూ.100 కోట్ల ప్రత్యేక నిధులు ఇవ్వడం నిజంగా రామగుండం నియోజకవర్గ ప్రజల అదృష్టం. ఇదే అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించండి. కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచండి. మీ బిడ్డనైన నన్ను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్త.

**- రామగుండం దశాబ్ది ప్రగతి సభలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

## కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డిని

# భారీ మెజార్టీతో గెలిపించండి

- చందర్‌కు పెద్దపల్లి జిల్లాలోనే అత్యధిక మెజార్టీ ఇవ్వండి
- మనోహర్‌రెడ్డిని 60వేల మెజార్టీ కట్టబెట్టండి
- ఇద్దరిని ఆశీర్వదిస్తే రెండు నియోజకవర్గాల్లో మరింత ప్రగతి
- మీరిచ్చే మెజార్టీతో రామగుండాన్ని దత్తత తీసుకుంటా
- ఐదేళ్లలో అద్భుతంగా తీర్చిదిద్దుతా
- మనోహర్‌రెడ్డిని గెలిపిస్తే పెద్దపల్లికి బస్‌డిపో, కొత్త మండలాలు, పంచాయతీలు
- రామగుండం, పెద్దపల్లి సభల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

.. 2లో

రామగుండంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను, పెద్దపల్లిలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. వీరిద్దరినీ ఆశీర్వదిస్తే ఇప్పటివరకు పదేళ్లలో జరిగిన అభివృద్ధి ఒకవైపు, రాబోయే ఐదేళ్లలో జరిగే అభివృద్ధి ఒకవైపు ఉంటుందని చెప్పారు. ప్రజలు ప్రతిపక్షాలు చెప్పే మాయమాటలకు ఆగం కావద్దని, అభివృద్ధిలో భాగం కావాలని సూచించారు. ఆదివారం ఆయన గోదావరిఖనిలో 'రామగుండం దశాబ్ది ప్రగతి సభ', పెద్దపల్లిలో 'ప్రగతి నివేదన సభ'కు ముఖ్య అతిథిగా హాజరై, ఆయాచోట్ల ప్రసంగించారు. ఓవైపు కాంగ్రెస్, బీజేపీ తీరును ఎండగడుతూనే.. మరోవైపు స్వరాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. చందర్‌కు పెద్దపల్లి జిల్లాలోనే అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలిపిస్తే, నియోజకవర్గాన్ని తానే స్వయంగా దత్తత తీసుకుంటానని, మీరు అనుకున్నదానికన్నా ఎక్కువ అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. అసలు సిసలైన బీఆర్ఎస్ బిడ్డా మనోహర్‌రెడ్డిని 50వేల నుంచి 60వేల భారీ మెజార్టీతో గెలిపిస్తే, ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. **- పెద్దపల్లి, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ)**

## ప్రగతి పండుగ

**రామగుండం, పెద్దపల్లిలో ₹360 కోట్ల పనులకు మంత్రి కేటీఆర్ అంకురార్పణ**

.. IVలో

## రామన్నకు నీరా'జనం'

..మధ్యపేజీలో

### మంత్రి కేటీఆర్ పర్యటన విజయవంతం

- గోదావరిఖని దశాబ్ది ప్రగతి సభ, పెద్దపల్లి ప్రగతి నివేదన సభకు వేలాదిగా జనం
- జవహర్‌లాల్ నెహ్రూస్టేడియం, ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం జనసంద్రం
- ప్రగతి సారథికి జయజయధ్వానాలతో స్వాగతం
- జోష్ నింపిన అమాత్యుడి ప్రసంగం
- కాంగ్రెస్, బీజేపీ తీరుపై ధ్వజం
- అభ్యర్థులు కోరుకంటి, దాసరిపై ప్రశంసల వర్షం
- భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి
- జేజేలు పలికిన సభికులు
- సభల సక్సెస్‌తో శ్రేణుల్లో నయా జోష్

యువసారథి, మంత్రి కేటీఆర్‌కు పెద్దపల్లి జిల్లా ప్రజలు నీరాజనం పలికారు. ఆదివారం ఆయన గోదావరిఖని, పెద్దపల్లిలో పర్యటించి, ₹360 కోట్లతో అభివృద్ధి పనులకు అంకురార్పణ చేయగా, ఆయాచోట్ల బ్రహ్మరథం పట్టారు. ముందుగా గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రామగుండం దశాబ్ది ప్రగతి సభ నిర్వహించగా, సభా స్థలి ఇసుకేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోయింది. తర్వాత పెద్దపల్లిలోనూ వేలాది మంది రావడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం కిటకిటలాడింది. ఆయాచోట్ల అమాత్యుడు రామన్న ప్రసంగాలతో ఉత్రూతలూగించగా, సభికులు 'జై కేసీఆర్' 'జైజై కేటీఆర్' అంటూ నినదించారు. మాట్లాడుతున్నంత సేపూ చప్పట్లు, ఈలలతో హోరెత్తించారు. ఓవైపు కాంగ్రెస్, బీజేపీ తీరును ఎండగడుతూనే, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని, బీఆర్ఎస్ అభ్యర్థులు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేయగా, ముక్తకంఠంతో జైకొట్టారు. 'మేమంతా మీ వెంటే ఉంటాం' అని అభయమిచ్చారు.

**- పెద్దపల్లి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ)/ పెద్దపల్లి/ ఫర్టిలైజర్‌సిటీ/ కోల్‌సిటీ**